క్లుప్తంగా

రక్తదాన, వైద్య శిబిరాలకు విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఫరీదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహించారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 27 మంది యువత రక్తదానం చేశారు. అనంతరం 215 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, దినేష్‌కుమార్, శోభన్, లక్ష్మి, సిబ్బంది సువ్వారి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతాకల్యాణ్ అనురాగ నిలయం, సి.వి.నాగజ్యోతి ఆనంద నిలయంలో గురువారం అన్నదానం గురువారం నిర్వహించారు. నైరా మాజీ ఎంపీటీసీ కర్రి జీవరత్నం వర్థంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నైరా వాటర్‌హెడ్ చానల్ పరిశీలన



క్లోరినేషన్ పరీక్షలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా గ్రామంలో మేజర్ వాటర్ హెడ్ చానల్‌ను శ్రీకాకుళం ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో నైరా నుంచి సుమారు 80 గ్రామాలకు సీపీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా మంచినీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ముందస్తు తనిఖీలు చేస్తూ క్లోరినేషన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్ఎస్ఆర్‌పురంలో జంగిల్ క్లియరెన్స్



తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని ఎస్ఎస్ఆర్‌పురంలో సర్పంచ్ దుంప చిన్నారెడ్డి సొంత నిధులు వెచ్చించి గురువారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించారు. గ్రామం నుంచి కొయ్యాం వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు.


బాధితులను ఆదుకోవాలి



కాలిపోయిన వలలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశం తీరంలో ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వలలు అగ్నికి ఆహుతి కావడంతో ఆ ప్రాంతాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం పరిశీలించారు. నష్టపోయిన తమను ఆదుకోవాలని బాధిత మత్స్యకారులు విజ్ఞప్తిచేశారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తానని ఎమ్మెల్యే చెప్పారు.

అంగన్‌వాడీలకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జి.సిగడాం: యూత్ క్లబ్ ఆఫ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ, బాల వికాస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ డోల పాపినాయుడు, సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రావణి పాల్గొన్నారు.

ఎక్కడి పనులు అక్కడే!



తుప్పలతో నిండిన జె.ఆర్.పురం ఆర్బీకే, వెల్‌నెస్, పాలవెల్లువ భవనాలు

- పడకేసిన పంచాయతీల ప్రగతి
- సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణాలకు బ్రేక్
- కూటమి సర్కారు నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు



తుప్పపట్టిపోతున్న జె.ఆర్.పురం-1 ఆర్బీకే భవన గజాలు

రణస్థలం: కూటమి సర్కారు పాలనలో పంచాయతీల్లో ప్రగతి పడకేసింది. ముఖ్యంగా ప్రభుత్వ భవన నిర్మాణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, జగనన్న పాల వెల్లువ కేంద్రాలు వంటి భవనాల నిర్మాణం చేపట్టారు. ఇందులో 70శాతం వరకు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. నిర్వహణ లేక భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

పూర్తి చేయాల్సిన నిర్మాణాలివే..				
భవనం	రణస్థలం	లావేరు	ఎచ్చెర్ల	జి.సిగడాం
గ్రామ సచివాలయం	7	7	8	2
ఆర్‌బీకే	19	13	17	4
గ్రామీణ ఆరోగ్యకేంద్రం	19	17	15	10

ముందుకు సాగని పనులు..

గత ప్రభుత్వంలో ఆయా భవనాల పనులు శరవేగంగా జరిగాయి. మొత్తం 99 గ్రామ సచివాలయాలు, 99 రైతు భరోసా కేంద్రాలు, 93 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల భవనాలు ఉన్నాయి. అందులో 75 వరకు గ్రామ సచివాలయాల నిర్మాణం పూర్తికావడంతో అందులోనే సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. మిగతా భవనాలు పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లో పనులు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఇంకా పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. వీటి నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. త్వరతగతిని పూర్తి చేసి వీటిని వినియోగంలోనికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు మంజూరు చేయాలి..

జే.ఆర్.పురం-2లో గ్రామ సచివాలయానికి 70 శాతం మాత్రమే నిధులు మంజూరై మిగతా పెండింగ్‌లో ఉన్నాయి. రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు సుమారు రూ.20లక్షలు ఖర్చు చేశాం. ఒక్క రూపాయి కూడా బిల్లు మంజూరు కాలేదు. ఎన్నికల కోడ్ తదుపరి ప్రభుత్వం మారడంతో వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం.

– రాయపురెడ్డి భుజంగరావు, రణస్థలం వైస్ ఎంపీపీ

పనులు ప్రారంభించాలి..

పెండింగ్‌లో ఉన్న ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల పనులు ప్రారంభించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలి. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందాలంటే పక్క భవనాలు తప్పనిసరిగా ఉండాలి.

– రెడ్డి విశ్వేశ్వరరావు, పిషిణి సర్పంచ్

ఆదేశాలు రాలేదు..

గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం వంటి భవనాల నిర్మాణాలపై ఎటువంటి ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాలేదు. నిర్మాణాలు దెబ్బతింటే పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని తెలిపారు.

– కె.మాధవిలత, పంచాయతీరాజ్ డీఈ

ఏడు రోడ్ల కూడలి టు అరసవల్లి మిల్లు జంక్షన్

సెంటర్ డివైడింగ్

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం
- అధికారులతో కలిసి పర్యటించిన డీఎస్పీ వివేకానంద



అధికారులతో కలసి నగర పర్యటన చేస్తున్న డీఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాకేంద్రంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు అధికారులు దృష్టి సారించింది. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి మున్సిపాలిటీ, టౌన్‌ప్లానింగ్ అధికారులను సమన్వయం చేసుకుని మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయమని ఇదివరకే డీఎస్పీ సీహెచ్ వివేకానందకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. దీనిలో భాగంగా డీఎస్పీగురువారం రాత్రి మున్సిపల్ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ సీఐ నాగరాజుతో కలిసి నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మొదటి ప్రాజెక్టులో ఏడు రోడ్ల కూడలి నుంచి అరసవల్లి మిల్లు కూడలి వరకు సెంటర్ డివైడింగ్, పార్క్ లైనింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. రోడ్డుపై ఆక్రమణలు ఖాళీ చేయాలని ఇప్పటికే సమాచారం ఇచ్చామని, ప్రజలు సహకరించాలని కోరారు. రోడ్లపై ఫుట్‌పాత్ వ్యాపారం ఉండరాదని, హోర్డింగ్‌లు ఎక్కడ పడితే అక్కడ పెట్టకుండా నిబంధనలు పాటించాలన్నారు. అక్కడక్కడా రోడ్డు మరమ్మతులు చేయాల్సి ఉందని, కొన్ని డ్రైనేజీపై శ్లాబ్‌లు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్లతో ఆర్థిక తోడ్పాటు



మెప్మా మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాదరావు

శ్రీకాకుళం: స్థిరమైన ఆర్థిక తోడ్పాటుకు మెప్మా అర్బన్ మార్కెట్లు దోహదం చేస్తాయని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు అన్నారు. గురువారం నగరంలోని రైతు బాజర్ సమీపంలో మెప్మా అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేందుకు కామర్స్ నెట్‌వర్క్ (ఓఎన్‌డీసీ) ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మహిళలు పారిశ్రామికవేత్తలుగా తయారుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.నాగలక్ష్మి, వి.వెంకటలక్ష్మి, మెప్మా సీఎంఎం ఎస్.వెంకటరావు, బి.భాస్కరరావు, బి.రామారావు, వి.విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు లేక ఇక్కట్లు



రాగోలు వాకలవలస ప్రాంతంలో నిర్మితమైన జగనన్న కాలనీ–ఎన్టీఆర్ నగర్‌కు రోడ్డు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ సుమారు 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న రోడ్డు గోతులమయం కావడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- శ్రీకాకుళం రూరల్

పట్టపగలే విద్యుత్ వెలుగులు



శ్రీకూర్మంలోని సునామి కాలనీలో వీధిలైట్లు పట్టపగలు కూడా వెలుగులు విరజిమ్ముతున్నాయి. సుమారు 30 లైట్లు కొన్ని నెలలుగా ఇలాగే వెలుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి విద్యుత్ వృథాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు. - గార

చెత్త సమస్యకు మోక్షమెప్పుడో?



ఎచ్చెర్ల రామ్‌నగర్ సమీపంలో రోడ్డు పక్కన చెత్త పోగులుగా పడి ఉంది. రోజుల తరబడి చెత్త నిలిచిపోతుండటంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

వేటకు విరామం



దానా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు దూరంగా ఉన్నారు. డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగుట్లపాలెంలో తీరంలోనే పడవలు, వలలు భద్రపరిచారు. మరోవైపు అధికారులు సైతం మత్స్యకార గ్రామాలను అప్రమత్తం చేశారు. తుఫాను షెల్టర్లను ముందస్తుగా సిద్ధం చేసినట్లు తహశీల్దార్ సింహాచలం తెలిపారు. - ఎచ్చెర్ల క్యాంపస్

తుఫాన్‌పై అప్రమత్తత అవసరం



బందరువానిపేటలో తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ బి.శాంతిశ్రీ

గార: దానా తుఫాన్ కారణంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ అన్నారు. గురువారం బందరువానిపేట, కె.మత్స్యలేశం తదితర గ్రామాల్లో తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. సచివాలయాల్లో వీఆర్వో, సెక్రటరీలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.రమణారావు, అధికారులు పాల్గొన్నారు.

జి.సిగడాం: తుఫాన్ నేపథ్యంలో వీఆర్‌ఓలు, వైద్య సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ సూచించారు. గురువారం వివిధశాఖ అధికారులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాధిక, ఆర్ఐ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత ప్రపంచమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: పోలియో రహిత ప్రపంచమే రోటరీ ఇంటర్నేషనల్ లక్ష్యమని క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ పోలియో నివారణ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో శ్రీకాకుళం వైఎస్సార్ కూడలి వద్ద పోలియోపై అవగాహన, విరాళాల సేకరణ నిర్వహించారు. ముందుగా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ పి.సత్యవాణి, శ్రీకాకుళం మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుదీర్ కుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ముని శ్రీనివాసరావులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ జిల్లా కార్యదర్శి డి.శివశంకర్, క్లబ్ కార్యదర్శి దూసి సంతోష్, కోశాధికారి పసగాడ సూర్య, పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ ఎంఆర్‌కే దాస్, మంత్రి వెంకటస్వామి, క్లబ్ మెడికల్ డైరెక్టర్ ఎస్ వసంతరావు, ప్రతినిధులు బమ్మిడి సందీప్, వారణాసి సందీప్, ఇప్పిలి వెంకన్నశెట్టి, కిల్లాన శ్రీనివాసరావు, ధర్మాన ధర్మారావు, బి.గిరి, జై శ్రీరామ్, రోటరీ సభ్యులు, క్రీడా ప్రతినిధులు, జెమ్స్ మెడికల్ కాలేజీ విద్యార్థినులు, చైతన్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాల ఐక్యతతోనే ప్రపంచ శాంతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కింతలి సూర్యచంద్రరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: శాంతి, భద్రత, మానవహక్కుల పరిరక్షణ, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై ప్రపంచ దేశాలను ఏకతాటిపైకి తీసుకువచ్చేలా ఐక్యరాజ్యసమితి కృషిచేయాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు అన్నారు. గురువారం కళాశాలలో చరిత్ర, టూరిజం, పొలిటికల్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి పైడి శంకరనారాయణ మాట్లాడుతూ ప్రపంచ శాంతి పరిరక్షణకు ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు సీహెచ్ కృష్ణారావు, ఎస్.చిన్నారావు, ఎస్.పద్మావతి, టి.ఆదిలక్ష్మి, కె.ప్రభాకర్, ఎస్.రుద్రమరాణి, ఎల్.కృష్ణారావు, డాక్టర్ రామజోగినాయుడు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఆచార్య ఎన్‌జీరంగా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో గురువారం నైరా అగ్రికల్చర్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రారంభించిన ఏక్‌పెడ్ మాకే నామ్ తల్లి పేరిట ప్రతి ఒక్కరూ మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నైరా అగ్రికల్చర్ అధ్యాపక బృందం, నెహ్రూ యువకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సాగుహక్కు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత తేజేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం పంచాయతీ నారాయణపురం రెవెన్యూ పరిధిలో సాగు చేస్తున్న రైతులకు భూములపై సాగు హక్కు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం చిలకపాలెంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపురం భూములపై పూర్తి స్థాయి హక్కు సాగు చేస్తున్న రైతులకే ఉందన్నారు. ఈ భూముల్లో ఇచ్చిన క్వారీ అనుమతులు రైతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల సర్దుబాటు వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తోనంగి నందోడు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కేజీబీవీ నియామకాలపై దర్యాప్తు చేపట్టాలి

శ్రీకాకుళం: జిల్లాలో జరుగుతున్న కేజీబీవీ బోధన, బోధనేతర ఉద్యోగాల భర్తీపై సమగ్ర విచారణ జరపాలని దళిత సంఘాల సంయుక్త మండలి ప్రతినిధి బెలమర ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జేసీకి గురువారం ఫిర్యాదు చేశారు. అంతకముందు ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ కూడా ఫిర్యాదు ప్రతిని అందజేశారు. తన కుమార్తె కెమిస్ట్రీ పీజీటీ పోస్టుకు దరఖాస్తు చేయగా గణితం డిగ్రీ లేదని అనర్హురాలిగా ప్రకటించారని పేర్కొన్నారు. ఇష్టారాజ్యంగా నియామక ప్రక్రియ కొనసాగిస్తున్నారని చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: అప్పుల బాధ తాళలేక రణస్థలం పంచాయతీ బండిపాలెం గ్రామానికి చెందిన ఆమర అయ్యప్ప(34) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జే.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 21న అయ్యప్ప పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అయ్యప్పకు భార్య దివ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన వీణ కచేరి



శ్రీకాకుళం కల్చరల్: వేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.సుధీర్ ఆధ్వర్యంలో కణుగుల పద్మజ 56వ జయంతి సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం నిర్వహించిన వీణ కచేరి అలరించింది. కంటి వైద్య నిపుణులు డాక్టర్ చట్టి రామకృష్ణ చక్కటి త్యాగరాజ కృతులు, సినీగీతాలను వీణా వాయిద్యంతో మెప్పించారు. అంతకుముందు రామకృష్ణను కణుగుల పద్మజ కళా పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డాక్టర్ కోమలరావు, నిక్కు అప్పన్న, భారతి రమేష్, కె.ఎల్.ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ సభ్యులకు అదనపు బాధ్యతలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పాలనాపరమైన అంతర్గత అదనపు బాధ్యతలను ఫ్యాకల్టీ సభ్యులకు అప్పగిస్తూ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులంతా వర్సిటీ ప్రగతికి కృషిచేయాలని వీసీ రజిని కోరారు.

నందెన్నకు దీపారాధన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధి ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాలలో భాగంగా గురువారం దీపారాధన నిర్వహించారు. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేఖ. చిత్రంలో డీఎస్పీ శేషాద్రి

శ్రీకాకుళం న్యూకాలనీ: సరదాల కోసమని చెప్పి యువత మత్తుపదార్థాల జోలికిపోయి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ అన్నారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో కళాశాల సిల్వర్‌జూబ్లీ ఆడిటోరియంలో గురువారం మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శేషాద్రి మాట్లాడుతూ డ్రగ్స్, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దానేటి శ్రీధర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బి.నరేంద్రచక్రవర్తి, రాజశేఖర్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గోపి, నగర సెక్రటరీ చరణ్, ఆఫీసు కార్యదర్శి అశోక్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

గార: మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ జరుగుతుందని తహశీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీఓ ఎస్. రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఇతర సమస్యలపై ప్రజలు వినతులు అందించవచ్చని పేర్కొన్నారు.